

తిరగబడ్డ... పోరుగడ్డ!

తెలంగాణ ఉద్యమంలో 'వరంగల్' కీలక పాత్ర



- ఎందరో ఆత్మబలిదానం
- ఊపునిచ్చిన మూడు సభలు
- కీలక భూమిక పోషించిన కేయూ
- జాక్‌తో ఏకమైన ఉద్యోగులు
- ఆటా పాట, వంటావార్పుతో హోరెత్తిన రోడ్లు
- చెరగని ముద్రగా మానుకోట ఘటన..
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు

5.6వ పేజీల్లో..



రైల్‌రోకోలో పాల్గొన్న ఉద్యమకారులు

లాఠీ దెబ్బలు, తూటాలను సైతం లెక్కచేయని మొండితనం.. ప్రాణత్యాగాలకు సిద్ధమైన స్వరాష్ట్ర ఆకాంక్ష.. ఆంధ్రా పాలకుల చేతుల్లో నలుగుతున్న తల్లి తెలంగాణకు విముక్తి కల్పించాలన్న దృఢ సంకల్పం.. విజయమో, వీరస్వర్గమో అన్న రీతిలో సాగిన పోరు.. ఎగిసేటి సంద్రంలా.. దూకే కెరటంలా సాగిన మహోన్నత పోరాటం.. స్వరాష్ట్ర సాధనతోనే తమ బతుకులు బాగుపడుతాయన్న నమ్మకం.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ఏకైక ఎజెండాగా సాగిన గొప్ప పోరాటం. చినుకు చినుకు కలిసి మహాసంద్రంగా మారినట్లుగా పిడికెడు మందితో ప్రారంభమైన ఉద్యమం.. ప్రపంచంలో అతిపెద్ద ప్రజా పోరాటంగా రూపుదిద్దుకుంది. ఉవ్వెత్తున సాగిన తెలంగాణ తొలి, మలి ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అద్వితీయమైన పాత్రను పోషించారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఎన్నో కీలక ఘట్టాలు, భారీ బహిరంగ సభలు, సదస్సులు వరంగల్ జిల్లా కేంద్రంగానే సాగాయి. ఉద్యమం సందర్భంగా తీసుకున్న ప్రతీ కీలక నిర్ణయం, ఇచ్చిన పిలుపునకు ఉమ్మడి వరంగల్ వేదికగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ఎలుగెత్తుతూ నిర్వహించిన భారీ బహిరంగ సభలకు ఓరుగల్లే వేదికైంది. తెలంగాణలోని అన్ని జిల్లాల కన్నా మిన్నగా వరంగల్ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాటి పోరాట గురుతులు, అమరుల ఆత్మబలిదానాలు, పలు కీలక ఘట్టాలపై ప్రత్యేక కథనం..

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

దశాబ్ది ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, జూన్ 1: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అమర వీరుల కుటుంబాలు, ఉద్యమకారుల గౌరవార్థం సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నందున జనగామ జిల్లా నుంచి 16 మంది అమరవీరుల కుటుంబాలను 5 వాహనాల్లో తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అదేవిధం గా 102 మంది ఉద్యమకారులు, వారి కుటుంబాలను 2 ఏసీ బస్సుల్లో ఉదయం 6 గంటలకు బయలుదేరనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు అవతరణ వేడుకల్లో పాల్గొనే విధంగా ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఆశాలు, ఏపీఎం లు, డీపీఎంలు, ఆరోగ్య సహాయకులు, అధికారులను నియమించి వారితో పంపాలని సూచించారు. రాష్ట్ర అవతరణ వేడుకల ను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం 9 గం టలలోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ను ఆవిష్కరించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలన్నారు. గ్రామ పంచాయతీలలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు.

కలెక్టరేట్‌లో ఏర్పాట్లు..

కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకొని చేయాల్సిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఏసీపీ అంకిత్‌కుమార్ శంఖ్వార్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బా షా ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకలను అట్టహాసంగా, నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఈవో కె.రాము, డీఏవో వినోద్‌కుమా ర్, డీసీఎస్‌వో రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా...

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కలెక్టరేట్‌లో ఉదయం 9 గంటలకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 9.02 గంటలకు గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.05 గంటలకు కలెక్టర్ సందేశం వినిపిస్తారు. 9.20 గంటలకు వేడుకలను ముగిస్తారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గాయి..

హనుమకొండ టౌన్, జూన్1: ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు గతం కన్నా చాలా తగ్గాయని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం పడకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఎన్పీడీసీఎల్ వ్యాప్తంగా ఉన్న 2,804 ట్రాన్స్‌ఫార్మర్లను డిసెంబర్ 2023 నుంచి మే 2024 వరకు 3,335 వరకు పెంచి అదనంగా 531 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. వినియోగం ఎక్కువగా ఉన్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తెలుసుకునేందుకు టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని, తద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్ తగ్గిందన్నారు. 25 శాతం ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, 23 శాతం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గాయన్నారు. ఫలితంగా వినియోగదారులకు అంతరాయాలు కనిష్టస్థాయికి తీసుకురాగలిగామన్నారు. తద్వారా ఎన్పీడీసీఎల్ పరిధిలో మార్చి 8న 15,623 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు నమోదైందన్నారు. వైఫల్యాలు తగ్గడం వల్ల విద్యుత్ డిమాండ్ తారాస్థాయికి చేరిందన్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వాలుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎన్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

తిరగబడ్డ పోరుగడ్డ

హనుమకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి ఉద్యమం నుంచే వరంగల్ ప్రజలు పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుతో ఇటు ఉద్యమాలు, అటు రాజకీయాలతో రెండు రకాలుగా తెలంగాణ పోరాటం బలపడింది. తెలంగాణ ఉద్యమ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శనంలో ఉద్యమం ముందుకు సాగడంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ముందు వరుసలో నిలిచారు. ఉద్యమసందర్భంగా నిర్వహించిన పలు సదస్సుల, భారీ బహిరంగ సభలు, ర్యాలీల్లో వేలాదిగా పాల్గొన్నారు. జై తెలంగాణ అంటూ.. పిడికిలి బిగించి నినదించారు.

ఆ మూడు సభలు

ఓరుగల్లు కేంద్రంగా ప్రధానంగా మూడు సభలు తెలంగాణ ఉద్యమాన్ని కొత్త మలుపు తిప్పాయి. 2003 ఏప్రిల్ 27న వరంగల్ జైత్ర యాత్ర పేరిట నిర్వహించిన సభకు 17 లక్షల మంది హాజరయ్యారు. అదే సంవత్సరం డిసెంబర్ 5న జనగామలో ఓరుగల్లు వీర గర్జన పేరుతో మరో భారీ బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత 2007లో తెలంగాణ విశ్వరూప సభ భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సభకు పది లక్షల మందికి పైగా పాల్గొన్నారు. 2010 డిసెంబర్ 16న హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డి పేటలో మహాగర్జన పేరుతో నిర్వహించిన ఘర్జన సభకు 25 లక్షల మంది హాజరయ్యారు. ఈ సభ గిన్నిస్‌బుక్ రికార్డులకెక్కింది. తెలంగాణ ఉద్యమాన్ని సరికొత్త మలుపు తిప్పిన కేసీఆర్ దీక్ష అరెస్టు ఘట్టంలోనూ వరంగల్ జిల్లా ప్రజలు కీలక భూమిక పోషించారు. కేసీఆర్‌కు మద్దతుగా నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లతో ఉమ్మడి జిల్లా అట్టుడికింది. కేసీఆర్ ఆమరణ దీక్ష జరిగినకాలంలో జిల్లా వివిధ చోట్ల ఉద్యమ ఉద్వేగంతో ఏడుగురు ఆత్మబలిదానాలు చేసుకున్నారు.

ఉద్యమంలో కేయూ

తెలంగాణ ఉద్యమంలో కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు క్రియాశీల పాత్రను పోషించారు. 2010 ఫిబ్రవరి 7న కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు పొలికేక పేరుతో పెద్ద బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాలయాల నుంచి లక్ష మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సభకు అఖిల భారత ఆర్య సమాజ్ అధ్యక్షుడు స్వామి అగ్నివేశ్, కె.జయశంకర్, ప్రొఫెసర్ కోదండరామ్ హాజరయ్యారు. హనుమకొండ కేంద్రంగా సాగిన అనేక ఉద్యమాల్లో వివిధ విద్యార్థి సంఘాలు ముందు నిలిచాయి. 14 విద్యార్థి సంఘాలు సంఘటితంగా ఈ సదస్సును భారీ ఎత్తున నిర్వహించాయి. రాయిని గూడెంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సభలో జై తెలంగాణ అంటూ నినదించడం ద్వారా విద్యార్థులు తమ ఉద్యమ కాంక్షను ఎలుగెత్తిచాటారు. రాళ్లు రువ్వి నిరసన తెలిపారు.

జేఏసీ కీలక భూమిక

తెలంగాణ విషయంలో రాజకీయ పక్షాలు దోబూచులాడుతుండడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి 2009 డిసెంబర్ 24న తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు కావడంలో వరంగల్ జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులే కీలక పాత్ర పోషించారు. ఆటపాట, వంటావార్పు తదితర అనేక రూపాల్లో తెలంగాణ ఉద్యమం సాగింది. ప్రతీ పల్లే, ప్రతీ పట్టణం పోరుబాట పట్టింది. బతుకమ్మ ఆటలతో ఊగిపోయింది.

వంటవార్పు, ధూం ధాంలు..

తెలంగాణ ఉద్యమంలో ప్రజలు తమ సంఘటిత శక్తిని చాటడానికి చేపట్టిన అనేక ఆందోళన రూపాల్లో వంటా వార్పు ఒకటి. ప్రజలంతా రోడ్లమీదికి వచ్చి ప్రధాన రోడ్లు, జంక్షన్లలో రోడ్లపైనే వంటలు చేశారు. అక్కడే కూర్చొని బంతి భోజనం చేశారు. వంటావార్పు కార్యక్రమంలో మహిళలు రోడ్లపై బతుకమ్మలు ఆడారు. ప్రజలు కళాప్రదర్శనలు ఇచ్చారు. ఉద్యమ కాలంలో పోరుసాగ్నిని రగిలించే ఆటపాటలతో నిర్వహించిన మరో ఆందోళన కళారూపం ధూం ధాం. ఉద్యమానికి ఎంతో ఊపునిచ్చిన ధూం ధాం నిర్వహణలోనూ ఉమ్మడి వరంగల్ ముందు భాగాన నిలిచింది. వరంగల్‌కు చెందిన అనేక మంది జానపద కళాకారులు, గాయకులు, కవులు తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఉరికించారు.

బలిదానాలు

ఉద్యమమే ఊపిరిగా బతికిన ఉద్యమకారులెందరో తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మబలిదానాలు చేశారు. పరుగెత్తుతున్న రైళ్లకు ఎదురెళ్లి జై తెలంగాణ అంటూ ఆత్మార్పణలకు పాల్పడ్డారు. ఒంటిపై కిరోసిన్ పోసుకొని తమను తాము ఆత్మాహుతి చేసుకున్నారు. 1969 ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 119 మంది బలైతే మలి ఉద్యమంలో 362 మంది ప్రాణత్యాగం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అప్పటి ఉమ్మడి పది జిల్లాల్లో మొత్తం 1,250 మంది ఆత్మబలిదానాలు చేసుకుంటే అందులో ఎక్కువమంది ఉమ్మడి వరంగల్ జిల్లావారే ఉన్నారు. ఎందరో వీరుల పోరాటం, మరెందరో అమర వీరుల ఆత్మబలిదానాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది.

మానుకోట ఘటన

మానుకోట ఘటన తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పింది. 2010 మే 28న సమైక్య నినాదంతో ఓదార్పు యాత్రకు వైఎస్ జగన్‌ను బయలు దేరారు. పార్లమెంటులో సమైక్య ప్లకార్డులు ప్రదర్శించిన జగన్ తెలంగాణలో కాలుమోపవద్దని, అందులో ఓరుగల్లు గడ్డపై అడుగు పెట్టనివ్వమని రాజకీయ జేఏసీతో పాటు, పలు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. జగన్‌ను స్వాగతించేందుకు సమైక్యవాదులు, అడ్డుకునేందుకు తెలంగాణవాదులు చెరోవైపు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో మోహరించారు. ఉద్యమకారులను సమైక్యవాదులు రెచ్చగొట్టడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. సమైక్యవాదుల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి కంకరరాళ్లనే ఆయుధాలుగా చేసుకొని ప్రతిఘటించారు. తెలంగాణ ఉద్యమకారులు పోలీసుల తుపాకీ తూటాలకు ఎదురొడ్డి నిలిచారు. మానుకోట రైల్వేస్టేషన్‌లో పెద్దఎత్తున గుమిగూడిన జనం జగన్ తోపాటు ఆయన అనుచరులకు వ్యతిరేకంగా 'జగన్ గోబ్యాక్'.. అంటూ వెయిటింగ్ రూమ్‌లోకి దూసుకు వచ్చే ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఉద్యమకారులపై దాడికి దిగారు. వెంటనే రెండో ప్లాట్‌ఫామ్ నుంచి ఉద్యమకారులు రాళ్లతో దాడి చేశారు. పోలీసులు కాల్పులు జరగపడంతో 15 మంది, రాళ్ల దెబ్బలకు మరో 25మంది గాయపడ్డారు. రైల్వేస్టేషన్ రణరంగంగా మారింది. ఆ తర్వాత కాలంలో ఈ ఘటనే తెలంగాణ ఉద్యమానికి మరింత స్ఫూర్తిగా నిలిచింది.

దశాబ్ది వేడుకలకు జిల్లా ఉద్యమకారులు

- హైదరాబాద్‌కు 150 మంది పయనం
- బస్సుల్లో తీసుకువెళ్తున్న అధికారులు

జనగామ కల్చరల్, జూన్ 1: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జిల్లా నుంచి ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు కలిపి మొత్తం సుమారు 150 మంది వెళుతున్నారని టీజీఏసీ చైర్మన్ కన్న పరశురాములు, ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ చల్లా అశోకవర్ధన్‌రెడ్డి శనివారం తెలిపారు. వారి జాబితాను కలెక్టరేట్ ఏవోకు సమర్పించి కావలసిన పాసులను సిద్ధం చేయాలని కోరారు. ఉదయం 5.45 గంటలకు కలెక్టరేట్ నుంచి బస్సుల్లో బయల్దేరతాయన్నారు. బస్సుల్లోనే టిఫిన్ పాకెట్, వాటర్, పాసులు అందజేస్తారని తెలిపారు. ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో సభ ముగిసిన అనంతరం భోజనాలు చేసి విశ్రాంతి అనంతరం సాయంత్రం టాంక్‌బండ్‌పై జరిగే కార్నివాల్ తిలకించి వస్తారని వివరించారు. మరింత సమాచారం కోసం ఉద్యమకారులు చల్లా అశోకవర్ధన్ రెడ్డిని 99897 58362 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు వడ్లూల రాజేందర్, ఎలపాటి రాంరెడ్డి, కన్నారపు పరశురాములు, రాగల్ల నరేష్ పాల్గొన్నారు.

మండలం	అమరవీరులు	కుటుంబ సభ్యులు
నర్మెట	మ్యాక శ్యాంసుందర్	కొమురయ్య
రఘునాథపల్లి	వంగాల రాజు	పుష్ప, తమ్ముడి నిర్మల
	లూనావత్ భోజ్యా	మంక్షి, నామ, చాచు
	బైరగోని యాకయ్య	రాజు
తరిగొప్పుల	సాంబారి నవీన్	నర్సింహులు
స్టేషన్‌ఘన్‌పూర్	నలిమెల శ్రీనివాస్	జయ
	వీరగోని కుమారస్వామి	ప్రవీణ్
	బల్లె కొమురయ్య	పూలమ్మ
పాలకుర్తి	చెరుకు ఆంజనేయులు	సుజాత
జనగామ	శ్రీమంతోజు రామలింగచారి	సృజన
	దేవరాయ సారంగపాణి	రమేష్
	గడప నర్సయ్య	రేణుక
బచ్చన్నపేట	బాశెట్టి వెంకటేశం	శోభ
జఫర్‌గడ్	సామల రాజమౌళి	శరత్‌చంద్ర
	లుకావత్ సురేష్	శాంతి
	బెతెల్లి కొమురారెడ్డి	పద్మ

అమరవీరుల కుటుంబ సభ్యులు వీరే ...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జనగామ జిల్లా నుంచి 16 మంది అమరవీరుల కుటుంబ సభ్యులకు ఆహ్వానం అందింది. వీరందరినీ ఆదివారం జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రత్యేక బస్సులో హైద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ఉత్సవాలకు తీసుకెళ్లనున్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్


ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 1: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీని ఏకకాలంలో చేసి రైతులు తిరిగి రుణాలు తీసుకునేలా చూడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న సీపీఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతుల రెండవ రోజు శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. పంటల సాగు సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎరువుల, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు రూ.2500, రూ.500లకే వంటగ్యాస్ వెంటనే అమలు చేయాలన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, రాపర్తి రాజు, బూడిద గోపి, సాదం రమేష్, సింగారం రమేష్, ఉపేందర్, కొడెపాక యాకయ్య, గట్ల మల్లా రెడ్డి, నరేందర్, షబానా, వెంకటేష్, రమాదేవి, పొదల నాగరాజు, మహేందర్, సారయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

రఘునాథపల్లి, జూన్ 1: మండల కేంద్రంలో ఎరువులతో పాటు విత్తనాల దుకాణాలను పోలీసులతో పాటు తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ప్రతీ దుకాణంలో పత్తి విత్తన ప్యాకెట్లు, లైసెన్స్‌కు సంబంధించిన పత్రాలు, స్టాక్ రిజిస్టర్, ఇన్‌వాయిస్ వివరాలు, బిల్ బుక్స్, స్టోర్ సర్టిఫికెట్ తదితర వివరాలను నిశితంగా పరిశీలించారు. విత్తన ప్యాకెట్లను ఎంఆర్‌పీకి మించి విక్రయించవద్దని యాజమానులను ఆదేశించారు. అదేవిధంగా రైతులు సైతం విడి విత్తనాలను కొనుగోలు చేయవద్దని, విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేసిన వారు తప్పనిసరిగా విత్తనాలు రసీదు తీసుకొని భద్రపరుచుకోవాలని సూచించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నరేష్, తహసీల్దార్ పి.యుగేందర్, మండల వ్యవసాయ అధికారి కాకి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్ర పోరులో ఆరిన సమిధలెన్నో..

జనగామ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం సందర్భంగా ఉద్యమకారులు కేసులకు బయపడకుండా పోరాటాలు చేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ధర్నా, రాస్తారోకో, రైల్‌రోకోలు చేశారు. స్వరాష్ట్ర సాధనను కాంక్షిస్తూ జిల్లా వ్యాప్తంగా 15 మంది వరకు అమరులయ్యారు. చినుకు చినుకు కలిసి మహాసంద్రంగా మారినట్లుగా పిడికెడు మందితో ప్రారంభమైన ఉద్యమం ప్రజాపోరాటంగా రూపుదిద్దుకుంది. రాష్ట్రం కోసం అమరులైన వారి కుటుంబాల్లో కొన్ని కుటుంబాలకు ఆర్థిక సాయం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వగా, ఇంకా కొన్ని కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సాయం, ఉద్యోగాలు అందలేదు.

సెగ రగిల్చిన రైల్‌రోకో..

ఉద్యమ సందర్భంగా జనగామ మండలం పెంబర్తిలో 2021, అక్టోబరు 15న నిర్వహించిన రైల్‌రోకో జనగామ ప్రాంతంలో ఉద్యమ సెగను మరింతగా పెంచింది. ఉద్యమకారులంతా రైలు పట్టాలపైకి గొర్రెలను తోలి రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. దీంతో సికింద్రాబాద్-కాజీపేట మార్గంలో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీనిపై సీరియస్ అయిన రైల్వే శాఖ 35 మంది ఉద్యమకారులపై కేసులు పెట్టింది. ఐదు రోజుల పాటు జైలు జీవితం గడిపిన అనంతరం ఉద్యమకారులంతా విడుదలయ్యారు. ఈ కేసు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది.

చంద్రబాబుపై రాళ్ల దాడి..

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసిపడుతున్న సమయం. అప్పటికే తెలంగాణ పట్ల రెండు కళ్ల సిద్ధాంతంతో ఉన్న చంద్రబాబు పట్ల ఉద్యమకారులు ఆగ్రహంతో ఉన్నారు. అదే సమయంలో 2013లో పాలకుర్తిలో జరిగే టీడీపీ 'రైతు పోరుబాట' సభకు వెళ్తున్న అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుపై జనగామలో ఉద్యమకారులు రాళ్ల దాడికి దిగారు. జనగామ చౌరస్తాలోని బస్టాండ్ కమర్షియల్ కాంప్లెక్స్ పైకి ఎక్కి చంద్రబాబు వెళ్తున్న వాహనంపై రాళ్లు విసిరారు. దీంతో పోలీసులు ఉద్యమకారులపై విచక్షణ రహితంగా లాఠీచార్జ్ చేశారు.

బచ్చన్నపేటకు ప్రత్యేక స్థానం


ట్యాంక్‌పై నుంచి దూకడంతో గాయాలతో దేవరాయ రమేశ్ (ఫైల్)


ఆత్మహత్య చేసుకున్న పొన్నం అశోక్ (ఫైల్)

బచ్చన్నపేట, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన పోరులో బచ్చన్నపేట ప్రజల తెగింపు ఆషామాషీ కాదు. ప్రత్యేక రాష్ట్రం కావాలని పట్టువీడకుండా పోరు చేశారు. కేసీఆర్ ఆమరణ దీక్ష చేసిన సమయంలో దీక్షను భగ్నం చేసి నిమ్స్ ఆస్పత్రికి తరలించగా, తెలంగాణ ఇక రాదని భావించి బలిదానం ద్వారా ఉద్యమాన్ని రగిలించాలని మండలంలోని కట్కూరు గ్రామానికి చెందిన దేవరాయ రమేశ్ ఒంటినిండా తెలంగాణ నినాదాలు రాసుకుని, వంద ఫీట్ల ట్యాంకు పైనుంచి దూకి 2009, డిసెంబరు 6న ఆత్మహత్యాయత్నం చేశాడు. ఒంటినిండా గాయాలతో రక్తపుమడుగులో పడిపోగా, అప్మారక స్థితిలో ఉన్న రమేశ్‌ను నిమ్స్‌కు తరలించారు. కేసీఆర్‌కు చికిత్స అందిస్తున్న బెడ్ పక్కనే రమేశ్‌కు అందించారు. ప్రస్తుతం కోలుకున్నప్పటికి కుటుంబ పోషణ భారమై, మందుల ఖర్చులు లేకుండా గడుపుతున్నాడు. అలాగే మన్‌షాన్‌పల్లికి చెందిన పొన్నం అశోక్ తెలంగాణ రాష్ట్రంను కాంక్షిస్తూ 2009, డిసెంబరు 14న ఆత్మహత్య చేసుకున్నాడు. మండల కేంద్రంలోని చౌరస్తాలో రెండు విడుతలుగా నిరాహార దీక్షలు కొనసాగాయి. మొదటి విడుత 162, రెండవ విడుత 62 రోజులు దీక్షలు చేశారు. ఇందులో సబ్బండ వర్గాలు పాల్గొన్నాయి. లింగాల ఘణపూర్‌లో మాజీ మంత్రి హరీష్‌రావును అరెస్టు చేసి బచ్చన్నపేట పీఎస్‌కు తీసుకురాగా, ఒక్కసారిగా మండలంలో అలజడి చెలరేగింది. ఎండీ జావేద్ అనే యువకుడు సెల్ టవర్ ఎక్కి దూకేందుకు యత్నించగా, ఉద్యమకారులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారు. ఆరాత్రి మండల కేంద్రంలో జరిగిన లాఠీచార్జ్‌ని ఇప్పటి వరకు ఎవరూ మర్చిపోవటం లేదు. ఇలా ఆత్మబలిదానాల్లో, ఉద్యమ సెగ రగిలించటంలో బచ్చన్నపేట ప్రజలు ముందున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును అంతా స్వాగతించినా, ఇప్పటి వరకు అనుకున్న లక్ష్యాలు నెరవేరలేదనే బాధను ఉద్యమకారులు వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురి ఆత్మబలిదానం




బైరగోని యాకయ్య (ఫైల్)


భోజ్యానాయక్ (ఫైల్)


వంగాల రాజు (ఫైల్)

రఘునాథపల్లి, జూన్ 1: ప్రత్యేక తెటంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో మండలంలోని ముగ్గురు ఆత్మబలిదానం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన బైరగోని యాకయ్య 24 సెప్టెంబరు, 2011న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, మండలంలోని అశ్వరావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వీరారెడ్డి తండాకు చెందిన లూనావత్ భోజ్యానాయక్ హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని కలెక్టర్ కార్యాలయం వైపు పరుగెత్తుతూ ప్రజలందరూ చూస్తుండగానే 24 మార్చి, 2012 ఆత్మబలిదానం చేసుకున్నాడు. అలాగే మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన వంగాల రాజు ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని 9 డిసెంబరు, 2009న ఆత్మబలిదానం చేసుకున్నాడు.

ఉరికొయ్యకు వేలాడిన మ్యాక శ్యాంకుమార్



నర్మెట, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఊరువాడా కలబడి నిలబడినట్లే నర్మెట మండలంలో ఉద్యమం ఉధృతంగా సాగింది. ప్రతీ ఒక్కరు రోడ్డుపైకి వచ్చి ఉద్యమంలో పాల్గొన్నారు. మండలకేంద్రంతో పాటు హన్మంతాపూర్, మచ్చుపహాడ్, వెల్దండ, అమ్మాపురం, గండిరామవరం, ఆగాపేట, బొమ్మకూరు తదితర గ్రామాలలో విద్యార్థులు తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులై ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హన్మంతాపూర్ గ్రామానికి చెందిన మ్యాక శ్యాంకుమార్ కాకతీయ యూనివర్సిటిలో పీజీ పూర్తి చేశాడు. స్వరాష్ట్ర ఉద్యమానికి ఆకర్షితుడై ఎక్కడ ధర్నాలు, నిరసనలు పాల్గొనేటోడు. బీఈడీ ఎంట్రెన్స్ ఎగ్జామ్ కూడా రాశాడు. తెలంగాణకు అనాడు జరుగుతున్న అన్యాయం చూసి కలత చెంది ఫిబ్రవరి 22, 2011న గ్రామంలో ఉరి వేసుకున్నాడు. "నా చావుతోనైనా ఆంధ్ర పాలకులు కండ్లు తెరచి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి" అని సూసైడ్ నోట్ రాశాడు. శ్యాంకుమార్ మృతితో మండలంలో ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక అప్పటి సీఎం కేసీఆర్ శ్యాంకుమార్ కుటుంబానికి రూ. 10 లక్షలు అందించి, ఉద్యోగం ఇచ్చారు.


జనగామ అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల పూజలు


జనగామ బాలాజీనగర్‌లో స్వామి వారి సేవలో భక్తులు


పాలకుర్తి సోమేశ్వరాలయంలో జయంతి పూజలు

అంజన్నకు నీరాజనం

- జిల్లాలో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు
- గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్రలు

జనగామ కల్చరల్, జూన్ 1: హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమాన్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హనుమాన్ స్వాములు మాలవిరమణ చేశారు. హనుమాన్ మృత్యుంజయ యాగం నిర్వహించారు. శనివారం హనుమత్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రం లోని హనుమత్ రామనాథ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీ అభయాంజనేయ స్వామికి ప్రధానార్చకులు మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో ప్రాతఃకాల ఆరాధనలు మొదలుకొని నవకలశ స్థాపనలు జరిపారు. భక్తులందరూ కలశాలను శిరస్సున ధరించి హనుమత్ నామాన్ని స్మరించారు. భక్తులకు మహదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదం అందించారు. కార్యక్రమంలో గజ్జెల నర్సిరెడ్డి, జక్కా నర్సిరెడ్డి, కందాడి యాదగిరి, మల్లారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని ఉమామహేశ్వర దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు రాజేష్ భార్గవ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారికి మల్లెపూలు, తమలపాకులు, ఎర్రగన్నేరు, కనకాంబరాలు, చామంతీలు, సింధూరంతో అభిషేకం చేశారు. ఆంజనేయ సహస్ర నామార్చనతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీను, శ్రీకాంత్, వినయ్, పవన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ 3వ వార్డులోని శ్రీ రేణుక ఎల్లమ్మ గుడిలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంజనేయ స్వామికి పంచామృతాలతో, వివిధ, ఫల రస, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో లగిశెట్టి పద్మావతి, దూడల శోభారాణి, మాదారపు కల్పన, దోసపాటి శ్రీలక్ష్మి, భాగ్య, జ్యోతి, స్వాతి, లోనె మంజుల తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద హనుమాన్ దేవాలయంలో ఎస్ఐ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహానికి పంచామృత అభిషేకం, గణపతి, లక్ష్మీ పణపతి, మన్యు సూక్త సహిత, నవగ్రహ మూల మంత్ర హోమాలు, పుష్పార్చన నిర్వహించగా పోలీసు కుటుంబాలు పాల్గొన్నాయి. మండలకేంద్రంలోని అభయాంజనేయ స్వామి, శ్రీరామాలయంలోని హనుమాన్ మూలవిరాట్టుకు, రామవరం, ఏడునూతుల, పెదబావి తండా ఆలయాల్లో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అన్ని హనుమాన్ ఆలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. మండలకేంద్రంలోని రామాలయంలో, రామవరంలో హనుమాన్ దీక్షా మాలదారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకుని కొండగట్టు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమంలో వేద పండితుడు పిండిపోలు మౌర్య శర్మ, నాగదక్షిణామూర్తి, పాలకుర్తి గౌతం శర్మ, ఏఎస్ఐ రమేశ్, కానిస్టేబుల్ కనకస్వామి, రఘుపతి, అరుణ్, మాలధారులు కోట రఘుపతి, వెంకటేశ్, పెట్లోజు నాగరాజు, మణికుమార్, ఎల్లాముల అనిల్, అంజనేయులు , తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: హనుమాన్ మాలధారులు, భక్తులు మండల కేంద్రంలోని భైరాగి హనుమాన్, ఆంజనేయస్వామి, వడ్డెగూడెంలోని అభయాంజనేయ స్వామి, పాతూరులోని కొండపై గల పెరుమాండ్ల హనుమాన్ స్వామి వారి విగ్రహాలకు చందనం వేసి, పూజలు జరిపి మొక్కులు చెల్లించారు. ప్రతీ ఏటా వేసవిలో వచ్చే వైశాఖ శుద్ధ దశమి నాడు హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన జయంతి వేడుకల్లో భక్త జనులు అధిక సంఖ్యలో పాల్గొని పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలతో ఆంజనేయస్వామిని కొలుస్తూ భజన కీర్తనలు ఆలపించారు. జయంతి సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. వడ్డెగూడెంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. పండితులు యెల్లంబట్ల శశిధర్‌శర్మ, ప్రకాశ్‌శర్మల నేతృత్వంలో జరిగిన ఈ జయంత్యోత్సవ కార్యక్రమాల్లో ఆలయాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, గౌరవ అధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, ప్రధాన కార్యదర్శి కన్న సోమశేఖర్, జ్యోతి యాకయ్య, అంచూరి యుగంధర్, దాంశెట్టి సోమేశ్వర్, సింగారపు రమేశ్, బైరి రవి, కృష్ణ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక పెద్ద చెరువు కట్టపై ఉన్న 40 అడుగుల హనుమాన్ విగ్రహం, ఆలయం వద్ద వేడుకలు హనుమాన్ భక్త మండలి పూజాదికాలు పెద్ద ఎత్తున చేపట్టారు. ఆలయం నుంచి స్టేషన్ ఘన్‌పూర్, శివాజీ చౌక్ మీదుగా శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. శివునిపల్లి పట్టన నగరేశ్వరాలయం ముందున్న హనుమాన్ దేవాలయంలో ఆంజనేయ స్వామి జన్మదిన వేడుకలు వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, స్వామి వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొడ్రాయి నుంచి శివాజీ చౌక్, గాంధీ చౌరస్తా మీదుగా ఘన్‌పూర్ బస్టాండ్ వరకు శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే ఆంజనేయ స్వామికి మహా క్షీరాభిషేకం నిర్వహించారు. శోభా యాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. ఘన్‌పూర్ హనుమాన్ దేవాలయంలో సీఐ ఎం.రాజు, ఎస్ఐ వినయ్, జీపీ ఈఓ సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్త మండలి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, ఇల్లందుల ప్రతాప్, జగన్ రెడ్డి, భక్త మండలి నాయకులు గోనెల ఎల్లయ్య, రాజేందర్, ఇ.ప్రసాద్, పెసరు సారయ్య, బంగ్లా శ్రీను, రమేశ్, ఎం.లింగం, సాంబరాజు, లింగం, ఎల్లయ్య, పి.రాజయ్య, పాండు, ఎం.కిషోర్, జిఎై గిరి, పూజారులు నరేష్, మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఉదయం నుంచే గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలకు భక్తులు తరలివెళ్లి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పురవీధుల్లో జై హనుమాన్, జై శ్రీరాం అంటూ శోభాయాత్ర నిర్వహించి భక్తిని చాటుకున్నారు. తాటికొండ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ స్వాములు, భక్తులు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి సముద్రాల పాండు, తాటికొండ ఆలయ చైర్మన్ పాలకుర్తి నాగరాజు, భక్తులు కొరుకొప్పుల మహేందర్, పర్శ రాజు, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి హనుమాన్ దేవాలయం ఆవరణలో శ్రీసీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణమహోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మెగు ఉపేంద్ర శర్మ, రంగోజు ఈశ్వరయ్య, హనుమాన్ మాలధారణ భక్తులు నాగులగాని నాగేశ్వర్, కంటేవాడ మహేందర్, పేర్వారి నానాజీ, చొక్కారావు, మేకల శ్రీనివాస్, గాజులపాటి కిషన్ రావు, మాసంపల్లి రాంబాబు, ప్రదీప్, కొలిపాక శ్రీనివాస్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పూజారులు డీ.వీ.ఆర్ శర్మ, నాగరాజు ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వర పూజతో పూజతో వేడుకలకు అంకురార్పన చేశారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, అధికారులు కొత్తపల్లి వెంకటయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

నర్మెట: మండలకేంద్రంలోని హనుమాన్ దేవాలయం మాలాధారణ స్వాములు, భక్తులతో కిటకిటలాడింది. స్వాములు ఇరుముడి పూజలు నిర్వహించారు. 41, 21, 11 రోజుల పాటు దీక్షలు చేసిన భక్తులు హనుమాన్ జయంతి సందర్భంగా మాల విరమణ చేశారు. అనంతరం ఇరుముడితో కొండగట్టు, భద్రాచలం తదితర దేవాలయాలకు వెళ్లారు. మండలకేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో పూజారి ప్రయాగ నాగభూషణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు ఆమెడపు అంజిరెడ్డి, చిర్ర మహిపాల్‌రెడ్డి, మహేశ్వరం రామకృష్ణ, చిర్ర రాజిరెడ్డి, పండుగ రాజారాం, పులి నరేష్, రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: హనుమాన్ జయంతిని పురష్కరించుకుని సిద్దులగుట్టతో పాటు గ్రామాల్లో ఉత్సవాలు జరిపారు. ఆలయాల్లో కొలువైన హనుమాన్ విగ్రహాలకు చందనాభిషేకాలు నిర్వహించారు. 108 రోజులు, 41 రోజులు, 21 రోజులు, 11 రోజులు మాలాధారణ చేసిన భక్తులు పలు ఆలయాలకు విరమణ కోసం తరలివెళ్లారు. కొడవటూరు సిద్దులగుట్టలోని హనుమాన్ ఆలయం వద్ద భక్తులు మాలవిరమణ చేశారు. మరికొందరు కొండగట్టు, భద్రాచలం, యాదగిరిగుట్ట, విజయవాడకు తరలి వెళ్లారు. కొన్నె గ్రామంలో కోడూరు శివకుమార్‌గౌడ్ అన్నదానం చేశారు. వేముల లక్ష్మణ్‌గౌడ్, సుధాకర్, శంకరయ్య, శ్రీనివాస్, భద్రయ్య పాల్గొన్నారు.

చిలుపూర్: చిలుపూర్ గుట్ట అభయాంజనేయ స్వామి ఆలయంలో బుగులు వెంకన్న దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు నేతృత్వంలో హోమపూజ నిర్వహించారు. కాగా, ప్రతీ శనివారం, మంగళవారం నిర్వహించే స్వామివారి కల్యాణంతో పాటు, సువర్ణ పుష్పార్చన, అష్టదళ పాద పద్మారాధన పూజా ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు పెద్దఎత్తున విరాళాలందించారు. గుగులోత్ దేవ్‌సింగ్ - లక్ష్మి రూ 10 వేలు, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు రూ 5 వేలు, వేణుముద్దల విష్ణువర్ధన్‌రెడ్డి - నిర్మల రూ 5 వేలు, గుళ్ళపల్లి శ్రీనివాస్ - భవాని రూ 3 వేలు అందించారు.


జఫర్‌గడ్‌లో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


కంచనపల్లిలో శ్రీసీతారాములవారి కల్యాణం జరిపిస్తున్న పూజారులు


చిలుపూర్ గుట్ట ఆలయంలో హోమపూజ చేస్తున్న పండితులు

త్వరలోనే ఘన్‌పూర్‌లో కోర్టు సేవలు


కోర్టు పనులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి రవీందర్‌శర్మ

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 1: స్టేషన్‌ఘన్‌పూర్‌కు మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు సేవలు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని జనగామ జిల్లా కోర్టు జడ్జి రవీందర్‌శర్మ తెలిపారు. ఘన్‌పూర్‌లో కోర్టు ఏర్పాటుకు ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఎంపిక చేయగా అందులో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. కోర్టుభవనంలో ఉండాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పనులు పూర్తైతే 20 రోజుల్లో కోర్టు సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేష్, కోశాధికారి అనిల్‌కుమార్ గౌడ్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

బుగులు వెంకన్న సన్నిధిలో పూజలు..

చిలుపూర్: చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న దేవాలయాన్ని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి రవిందర్ శర్మ శనివారం సందర్శించారు. సతీమణి సురేఖతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పూజారులు వారికి స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందించి, ఆలయ విశిష్టత, స్వామివారి స్థల పురాణాన్ని వివరించారు.

భూవివాదంపై డీసీపీ విచారణ

బచ్చన్నపేట, జూన్ 1: మండలంలోని పోచన్నపేట గ్రామంలో రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న భూవివాదంపై శనివారం డీసీపీ సీతారాం క్షేత్రస్థాయి విచారణ జరిపారు. సర్వే నెంబర్ 422, 423లలో 20 మంది ఎస్సీలకు చెందిన 26 ఎకరాలకు సంబంధించి కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. అక్రమంగా ఒకరి భూమి మరొకరు కబ్జాచేసి, రికార్డు చేయించుకున్నారని కొందరు, ఇదే సర్వేనంబర్‌లలోని సుమారు ఆరు ఎకరాల భూమిని ఇతరులకు అమ్ముకున్నారని మరి కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీసీపీ స్వయంగా వచ్చి ఒక్కో రైతును విడివిడిగా పిలిచి భూమి గురించి వివరాలు సేకరించారు. దీనిపై ఓ స్పష్టత వచ్చే వరకు ఎవరు గొడవలకు దిగవద్దని, అతిక్రమిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సతీష్, రైతులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి


లచ్చమ్మ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 1: స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో శుక్రవారం రాత్రి ఓ వృద్ధురాలు వడదెబ్బతో మృతిచెందారు. ఛాగల్ గ్రామానికి చెందిన బాస్కుల లచ్చమ్మ (68) శుక్రవారం ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు వడగాలి వీయడంతో అస్వస్థత చెంది ఇంట్లోనే చనిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉండే లచ్చమ్మ శనివారం ఉదయం బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగువారు వెళ్లి చూడగా అప్పటికే కన్నుమూసింది. అదే గ్రామంలో వేరే చోట నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులకు గ్రామస్థులు సమాచారం అందించారు. మాజీ సర్పంచ్ పోగుల సారంగపాణి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

పాము కాటుతో మహిళ..


మృతిచెందిన దండవ్వ

నర్మెట, జూన్ 1 : మండలంలోని హన్మంతాపూర్‌లో మ్యాక దండవ్వ(55) అనే మహిళ పాము కాటుతో మృతిచెందింది. శనివారం ఆమె తన వ్యవసాయ బావి వద్ద ఆవుల మేత కోసం సొప్ప కోస్తుండగా కుడి చేతికి పాము కాటు వేసింది. వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో జారి పడి వ్యక్తి..


కొమురయ్య (ఫైల్)

జఫర్‌గడ్, జూన్ 1 : మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన సంగి కొమురయ్య (55) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిన కొమురయ్య సాయంత్రం ఊరి చెరువు పక్క నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఎక్కడ వెతికినా కనిపించలేదు. శనివారం ఉదయం ఉప్పుగల్లు చెరువులో అతడి మృతదేహం లభ్యమైంది. ఆయనకు భార్య ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.